

స్మార్ట్ క్లాస్‌రూంలతో..
ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూంలతో అత్యున్నత విద్య అందుతుందని సినీ నటి మంచు లక్ష్మి అన్నారు.
- 8లో



పోచంపల్లిలో అసిస్టెంట్ కలెక్టర్లు
2023 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు అసిస్టెంట్ కలెక్టర్లు సోమవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు.
- 10లో

గరిష్టం / కనిష్టం
30°/24°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొత్త న్యాయ చట్టాలను పటిష్టంగా అమలు చేస్తాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేటటౌన్ : కొత్త న్యాయ చట్టాలను పటిష్టంగా అమలు చేస్తామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా అవగాహన పోస్టర్ ను విడుదల చేసి మాట్లాడారు. కొత్త చట్టాలు అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 170 కేసులు నమోదనైట్లు వెల్లడించారు. చట్టాలను అతిక్రమించకుండాపౌరులు బాధ్యతగా నడుచుకోవాలని, చట్టాలను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు వీర రాఘవులు, సీఐలు చరమంద రాజు, రఘువీర్ రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి లో పది ఫిర్యాదులు వచ్చాయి. వీటిని ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రిన్సిపల్ శైలజను సస్పెండ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సృజన

సూర్యాపేట రూరల్: విద్యార్థినులను వేధింపులకు గురి చేస్తున్న బాలెంలలోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శైలజను సస్పెండ్ చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన కోరారు. సోమవారం సూర్యాపేట మండలం బాలెంల దగ్గర ఉన్న ఎస్సీ డిగ్రీ కళాశాలను సందర్శించి మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందించాలని అడిగిన విద్యార్థినులను టార్గెట్ చేసుకొని వేధిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌సీఓ అరుణకుమారి జిల్లాలోని గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్‌తో కుమ్మక్కై విద్యార్థినుల ఇబ్బందులను పట్టించుకోవడంలేదన్నారు.మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీ వేసి సస్పెండ్ చేయాలని చెప్పినా అధికారులు ఇంత వరకు చర్యతీసుకోకుండా కాలయాపన చేస్తే ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవర మల్లేశ్వరి, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సట్టు అంజమ్మ, లక్ష్మి, కోటమ్మ పాల్గొన్నారు.

ఆర్‌ఐ అబ్దుల్ నబీ సస్పెన్షన్

భానుపురి (సూర్యాపేట) : హుజూర్‌నగర్ ఎంఎల్ ఎస్ గోదాం ఇన్‌చార్జ్, ఆర్‌ఐ ఎస్.కె అబ్దుల్ నబీని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల బియ్యం అక్రమంగా రవాణా చేస్తూ వాడపల్లి వద్ద పోలీసులకు ఒక లారీ పట్టుబడింది. కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్ అధికారులు హుజూర్‌నగర్ ఎంఎల్ ఎస్ గోదాంను తనిఖీ చేసి 42.446 మెట్రిక్ టన్నుల బియ్యం తక్కువగా ఉండడంతో నివేదిక ఇచ్చారు. దీని ఆధారంగా గోదాం ఇంచార్జ్ అయిన ఆర్‌ఐ అబ్దుల్ నబీ ని సస్పెండ్ చేశారు.

ఎస్‌ఐ ఆత్మహత్యకు కారకులను తొలగించాలి

సూర్యాపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన సీఐ, సిబ్బందిని తక్షణమే సర్వీస్ నుంచి తొలగించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తళ్లమల్ల హసేన్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపీ డిమాండ్ చేశారు. ఎస్‌ఐ ఆత్మహత్యకు బాధ్యులైన వారిని శిక్షించాలని కోరుతూ సోమవారం సూర్యాపేట పట్టణంలోని రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్, మాల మహానాడు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం, ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బోయిళ్ల అఖిల్, నాగేందర్ నాయక్, ఎలిజాల సురేష్, చిన్నపంగి నరసయ్య, వేల్పుల వెంకన్న, దయానంద్, సతీష్, న్యాయవాది ఎడిండ్ల అశోక్, పిండిగ అశోక్,ఎడ్ల కళ్యాణ్ పాల్గొన్నారు.

వసతి.. అధోగతి

ఇది సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్సీ బీ2 బాలుర పాఠశాల హాస్టల్‌లో వసతులు సరిగా లేవు. ఈ హాస్టల్‌లో 80 మంది విద్యార్థుల వరకు ప్రస్తుతం వసతి పొందుతున్నారు. విద్యార్థులు స్నానం చేసేందుకు బాత్రూంలు, బయట నల్లాలు లేవు. ఇందులో ఒక బోరింగ్ ఉంది. విద్యార్థులంతా ఆ బోరింగ్ నీళ్లతోనే స్నానం చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఉదయం విద్యార్థులందరూ ఒకేసారి బోరింగ్ నీళ్ల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి కనిపిస్తుంది. అలాగే మరుగుదొడ్ల తలుపులు శిథిలావస్థకు చేరాయి.



సూర్యాపేట ఎస్సీ బీ2 హాస్టల్‌లో విద్యార్థులు స్నానం చేసే చేతిపంపు

ఆత్మకూర్(ఎస్) ఎస్సీ హాస్టల్ ఇటీవల విద్యార్థి శ్యాం కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందినా వసతులు మాత్రం మెరుగుపడలేదు. ఆవరణలోని కంపచెట్లను తొలగించినా పూర్తి స్థాయిలో లైట్లు ఏర్పాటు చేయలేదు. వంట గదిలో పందికొక్కులు తవ్వడంతో మట్టి కుప్పలు పేరుకుపోయాయి. వంటగది తలుపు సరిగా లేదు. ఇందులోనుంచి పురుగులు, ఎలుకలు, పాములు, పందికొక్కులు వచ్చేఅవకాశం ఉంది. హాస్టల్ గదుల్లోనే విద్యార్థులు పడుకుంటున్నారు. కానీ ఏ గదిలో కూడా కిటికీలు సరిగా లేవు. కిటికీల నుంచి కూడా పాములు, పురుగులు గదుల్లోకి వచ్చే అవకాశం ఉంది. డైనింగ్ హాల్ ఉన్నా ఆరు బయటనే విద్యార్థులు భోజనం చేస్తున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ మరమ్మత్తులకు గురికావడంతో బోరు నీరే తాగుతున్నారు.



వంట గదిలో మట్టి కుప్పలు

సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు

- కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిన పరిసరాలు
- విషపురుగుల సంచారం
- తలుపులు లేని గదులు, కిటికీలు, బాత్‌రూమ్‌లు
- అధికారుల పర్యవేక్షణలేక నిర్వహణ అస్తవ్యస్తం
- 'సాక్షి' విజిట్‌లో వెలుగులోకి



కుడకుడలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో చిరిగిన పరుపులు

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్సీ,ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు సమస్యల్లో కునారిల్లుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. విషపురుగులు, దోమలకు నిలయంగా మారాయి. విరిగిన కిటికీలు, తలుపులు, డోర్లు లేని మరుగుదొడ్లు, సరిపడా లేని స్నానాల గదులు , చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి నల్లాలు లేకపోవడం.. ఇలా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. హాస్టళ్లను సాక్షి విజిట్ చేయగా అనేక సమస్యలు వెలుగుచూశాయి.



బి.చందుపట్ల హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న స్నానపు గదులు

జిల్లాలో హాస్టళ్లు ఇలా..

కేటగిరీ	హాస్టళ్లు	విద్యార్థులు
ఎస్సీ	38	3500
ఎస్టీ	21	3000
బీసీ	33	2200

సమస్యలు ఇలా..

◆ అర్వపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. మొత్తం 10 రేకుల గదులు, 10 టాయిలెట్లు ఉన్నాయి. ఈ వసతి గృహంలో ప్రస్తుతం 32 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. మెనూ ప్రకారం పిల్లలకు పులిహోర పెట్టారు. అయితే 2003 నుంచి ఇక్కడ అద్దె భవనంలోనే వసతిగృహం కొనసాగుతోంది. అంతకు ముందు మండల పరిధిలోని తిమ్మాపురంలో ఈవసతి గృహం ఉండేది. దీనికి హాస్టల్ వెల్ఫేర్ అధికారి కూడా ఉన్నారు. ఈ వసతి గృహానికి అన్ని సౌకర్యాలతో సొంత భవనం నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.



బి.చందుపట్ల హాస్టల్‌లో వంటగది గోడలకు నిమ్ము వచ్చిన దృశ్యం

◆ తుంగతుర్తి మండల కేంద్రంలో బీసీ హాస్టల్, ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పూర్తిగా మూసివేశారు. బీసీ వసతి గృహంలో 62 మంది, ఎస్సీ బాలికల వసతి గృహంలో 35 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం నుంచి నోటు బుక్స్, దుప్పట్లు ,కాస్మోటిక్స్ ఏవీ రాలేదు. బీసీ వసతి గృహంలో అప్పుడప్పుడు నీటి సమస్య ఏర్పడుతోంది. బీసీ వసతి గృహానికి నీటిని అందించే బోరు చెరువులో ఉంది. అక్కడే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంవల్ల అది కాలిపోతే రైతులు పట్టించుకోని సమయంలో వసతి గృహానికి నీటి సమస్య ఏర్పడుతుంది.

◆ నేరేడుచర్లలోని ఎస్సీ, బీసీ ప్రభుత్వ బాలుర వసతి గృహాల్లో అరకొర వసతులు ఉన్నాయి. 30 ఏళ్లగా ఎస్సీ బాలుర వసతి గృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. వసతి గృహంలో మంచాలు లేక చిరిగిపోయిన పరుపుల పైనే పడుకుంటున్నారు. వంటి గది ఇరుకుగా ఉంది.



ఆత్మకూర్ ఎస్సీ హాస్టల్‌లో పగిలిన కిటికీల అద్దాలు

◆ చివ్వెంల మండలంలో ఒక ఇంటిగ్రేటెడ్ హాస్టల్, రెండు ఎస్సీ బాలుర హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో కుడకుడ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 60 మంది విద్యార్థులకు 47 మంది ఉన్నారు. బి.చందుపట్ల ఎస్సీ బాలుర హాస్టల్‌లో 20 మందికి 16 మంది ఉన్నారు. జి.తిర్మలగిరి హాస్టల్‌లో 22 మందికి 17 మంది ఉన్నారు. వీటిలో బి.చందుపట్ల హాస్టల్‌లో మరుగుదొడ్లు, స్నానపు గదులు అధ్వానంగా ఉన్నాయి. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ నిరుపయోగంగా మారింది. కొత్తది తీసుకువచ్చినా అమర్చకపోవడంతో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ గదుల తలుపులు విరిగిపోయాయి. పరిసరాలు మొత్తం చెత్తచెదారంతో నిండిపోయాయి. కుడకుడ హాస్టల్ పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.

● జోహార్ వైఎస్సార్



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం తుంగతుర్తిలో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నలుగురికి కార్పొరేషన్ పదవులు

పటేల్ రమేష్‌రెడ్డి, ముత్తినేని వీరయ్య, ప్రీతమ్, శోభారాణికి అవకాశం

- మార్చి నెలలోనే పేర్లు ఖరారు.. తాజాగా ఉత్తర్వులు జారీ
- భువనగిరి, సూర్యాపేట జిల్లాల నేతలకు చోటు
- నిరాశలో నల్లగొండ నాయకులు
- త్వరలో మరో జాబితా వస్తుందంటున్న కాంగ్రెస్ వర్గాలు



పటేల్ రమేష్‌రెడ్డి



నాగరిగారి ప్రీతమ్



ముత్తినేని వీరయ్య



బంద్రు శోభారాణి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు నేతలకు నామినేటెడ్ పదవులు దక్కాయి. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు పెద్ద సంఖ్యలో ఉన్నా.. మొదటి విడతలో నలుగురికి అవకాశం కల్పించింది. మార్చి నెలలోనే ఈ పదవులకు నేతల పేర్లను ఖరారు చేసినా పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అధికారికంగా జీవో విడుదల చేయలేదు. ఇప్పుడు ఆ ఉత్తర్వులను జారీచేసింది. సూర్యాపేట జిల్లాకు చెందిన పటేల్ రమేష్‌రెడ్డిని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, ముత్తినేని వీరయ్యను రాష్ట్ర వికలాంగుల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించింది. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నాగరిగారి ప్రీతమ్‌ను రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, బంద్రు శోభారాణిని రాష్ట్ర మహిళ సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా నియమించింది. వారు విధుల్లో చేరిన నాటి నుంచి రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో వివరించింది.

పదవులపై గతంలో హామీలు..

మునుగోడు నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉండటంతోపాటు రేవంత్‌రెడ్డి వచ్చాక ఆయన వర్గంలోనే ఉన్నారు. 2014, 2018 సాధారణ ఎన్నికల్లో, ఆ తరువాత మునుగోడు ఉప ఎన్నికల్లో టికెట్ ఆశించారు. వివిధ కారణాలతో ఆయనకు టికెట్ దక్కలేదు. ఈసారి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో తనకు కార్పొరేషన్ పదవిని ఇస్తారన్న ఆశతో ఉన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటూ తన ప్రయత్నాలు చేసుకుంటున్నా మొదటి జాబితాలో అవకాశం దక్కలేదు. పవర్‌లూమ్స్ కార్పొరేషన్, హ్యాండ్లూమ్ కార్పొరేషన్, పద్మశాలి కార్పొరేషన్ పదవులు ఉన్నందున తనకు ఇస్తారన్న ఆశతో ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాన అనుచరుల్లో ఒకరైన నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తనకు కచ్చితంగా నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఆయన ఆశించడమే కాదు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక సందర్భంగా మోహన్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవిని ఇప్పిస్తానని ప్రకటించారు. కానీ సోమవారం ప్రకటించిన జాబితాలో ఆయన పేరు రాలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నకిరేకల్ టికెట్ ఆశించిన పార్టీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యకు రాష్ట్ర కార్పొరేషన్ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ మిర్యాలగూడ టికెట్ ఆశించగా, పార్టీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ తుంగతుర్తి టికెట్ ఆశించారు. అయితే కార్పొరేషన్ పదవులు ఇస్తామని వారిని అప్పట్లో బుజ్జగించిన అధిష్టానం ఇప్పుడు ప్రకటించిన మొదటి జాబితాలో వారికి స్థానం కల్పించలేదు. రెండో జాబితాలో తమకు కార్పొరేషన్ పదవులు వస్తాయని ఆశిస్తున్నా అధిష్టానం ఇస్తుందా? లేదా? ఎవరికి ఇస్తుందన్నది ఈ నెలాఖరుకు తేలనుంది.

మరో జాబితా వచ్చేనా..

ప్రస్తుతం నలుగురికి మాత్రమే పదవులను కట్టబెట్టిన ప్రభుత్వం మిగతా వారి విషయంలో ఏంటన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు తమ గాడ్ ఫాదర్‌లు అయిన మంత్రులను నమ్ముకున్న నేతలు తమకు పదవి దక్కకపోవడంతో నిరాశలో ఉన్నారు. మరో జాబితా వస్తుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నా.. తమకు ఇస్తారో లేదోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాము నమ్ముకున్న నేతలను కలిసి తమకు ఎలాగైనా అవకాశం కల్పించాలని గోడు వెళ్లబోసుకునే పనిలో పడ్డారు. ఉమ్మడి జిల్లా పరంగా చూస్తే నలుగురికి కార్పొరేషన్ పదవులు దక్కినా కొత్త జిల్లాల వారీగా చూస్తే మాత్రం నల్లగొండ జిల్లాకు మొదటి జాబితాలో ఏ పదవీ ఇవ్వలేదు. నాలుగు పదవులు యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకే వచ్చాయి.

ఎక్స్‌ప్రెస్ హైవే పనులు ప్రారంభిస్తాం



ట్రామాకేర్ సెంటర్ భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు

- రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ట్రామాకేర్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ

కేతేపల్లి : హైదరాబాద్-విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారిని ఆరులేన్లుగా మార్చే ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులను రెండు నెలల్లో ప్రారంభిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేతేపల్లి మండల కొర్లపహాడ్ శివారులో గల టోల్‌ప్లాజా వద్ద ఏడీపీ (ఆటోమెటిక్ డాటాబేస్ ప్రాసెస్) ఆధ్వర్యంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ట్రామాకేర్ సెంటర్ భవన నిర్మాణానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలతో కలసి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ 65వ నంబరు జాతీయ రహదారిని 2022లోనే ఎక్స్‌ప్రెస్ హైవేగా మార్చాల్సి ఉన్నా.. కోర్టు కేసుల కారణంగా వీలు కాలేదన్నారు. ఈ రహదారిని ఆరులేన్లుగా విస్తరించాల్సిన ఆవశ్యకతను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి రూ.4300 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. జాతీయ రహదారిపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న 17 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించి ప్రమాదాల నివారణకు రూ.350 కోట్లతో ఫ్లై ఓవర్లు, విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి తక్షణ వైద్యం అందించి మరణాల సంఖ్య తగ్గించాలనే సంకల్పంతో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చి ఏడీపీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. మూసీనదిని రూ.40 వేల కోట్లతో ప్రక్షాళన చేసి ఈ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగు, సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, ఏడీపీ ఇండియా ఎండీ వేములపల్లి విజయ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుజ్ఞాన్ వెంకటేష్, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిచందన, కలెక్టర్ నారాయణరెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఎస్పీలు శరత్‌చంద్ర పవార్, సన్‌ప్రీత్‌సింగ్, కేతేపల్లి తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం పూజలు నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, అభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం ముఖ మండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం, అష్టోత్తర పూజలు గావించారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన , నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు.అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించారు. శివాలయంలో శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం చేశారు.

7.98లక్షల మొక్కలు నాటాం

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : వనమహోత్సవం కింద ఇప్పటి వరకు 7,98,100 మొక్కలు నాటినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బీ.ఎస్. లతతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ సురేష్ కుమార్, సీపీఓ కిషన్, సంక్షేమ అధికారులు లత, శంకర్, అనసూర్య, జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

యువతను జాగృతం చేయాలి

జిల్లాలో యువతను గంజాయి, ఇతర మత్తు పదార్థాల నుంచి జాగృతం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్‌కోర్డ్ జిల్లా స్థాయి సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వరరావుతో కలిసి పాల్గొని మాట్లాడారు.



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, డీపీఓ సురేష్ కుమార్, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీఎంహెచ్ఓ కోటా చలం, డీడబ్ల్యూఓ వెంకటరమణ, ఆర్‌డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వయోవృద్ధులను వేధిస్తే చర్యలు

వయోవృద్ధులను వేధించినా , హింసించినా చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన httpr-://tgseniorcitizens.cgg.gov.in వెబ్ పోర్టల్ ఆయన ఆవిష్కరించారు.

నూతన ఆవిష్కరణలకు వేదిక కావాలి

భానుపురి (సూర్యాపేట) : నూతన ఆవిష్కరణలకు సూర్యాపేట జిల్లా వేదిక కావాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను అదనపు కలెక్టర్ బీఎస్ లత తో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలతో పాటు కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు, తమకు నచ్చిన ఆవిష్కరణలకు సంబంధించి మూడు నిమిషాల వ్యవధిలో వీడియో తీసి 9100678543 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. ఇన్నోవేషన్ల నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే పరేడ్ గ్రౌండ్‌లో అవకాశం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వివి అప్పారావు, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, డీఎంహెచ్ఓ కోటాచలం, డీపీఓ సురేష్ కుమార్, డీటీడీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

డిండి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం తాటికొల్ వాగు నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు డిండి మండల పరిధిలోని చెర్కుపల్లి గ్రామ స్టేజీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చింతపల్లి: మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మాల్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఎండీ సలీం శనివారం ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 40 తులాల వెండి, 2 గ్రాముల బంగారం, రూ.10వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ ఘటనకు సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి గాయాలు

డిండి: బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సాయంత్రం డిండి మండల కేంద్రంలో జరిగింది. డిండి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రగడ్డతండాకు చెందిన మూడావత్ ప్రవీణ్ స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోకి రాగానే బైక్ పైనుంచి అదుపుతప్పి కిందపడటంతో ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీకి తాళం వేసి ఉండటం, అక్కడ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో 108 వాహనంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

భవనంపై నుంచి పడి తాపీ మేస్త్రి మృతి

బీబీనగర్: భవనంపై నుంచి పడి తాపీ మేస్త్రి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం బీబీనగర్ మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు జిల్లా దెనువుకొండ మండలం గూడూరు గ్రామానికి చెందిన గుంజి వెంకటేశ్వర్లు(29) బీబీనగర్ మండల కేంద్రంలోని పోచంపల్లి చౌరస్తా నుంచి బ్రహ్మణపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో సుంకరి లింగారెడ్డి ఇంటి నిర్మాణంలో తాపీ మేస్త్రిగా పనిచేసేందుకు సోమవారం వచ్చాడు. మధ్యాహ్న సమయంలో భవనం మూడో అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పక్కనే ఉన్న ఇంటిపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య గుంజి మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


సంతోష్‌రెడ్డి (ఫైల్)

బొమ్మలరామారం: అప్పుల బాధతో పాటు కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండల కేంద్రంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన మోకు నర్సింహారెడ్డి పెద్ద కుమారుడు సంతోష్‌రెడ్డి (24) పాల వ్యాపారం చేసేవాడు. సంతోష్‌రెడ్డి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీనికి తోడు పాల వ్యాపారం పెంచేందుకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కనబడక తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో సోమవారం కడుపునొప్పి భరించలేక గ్రామ శివారులో గల చిమ్ముల సత్తిరెడ్డి వ్యవసాయ బావి వద్ద పశువుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

స్మార్ట్ క్లాస్‌రూంలతో అత్యున్నత విద్య


భువనగిరి: స్మార్ట్ క్లాస్‌రూం గురించి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ జెండగే తదితరులకు వివరిస్తున్న మంచు లక్ష్మి

- సినీ నటి, టీచ్ ఫర్ చేంజ్ సంస్థ సీఈఓ మంచు లక్ష్మి

భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూం ఏర్పాటు ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మాదిరి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత విద్య అందుతుందని,టీచ్ ఫర్ చేంజ్ సంస్థ సీఈఓ, సినీ నటి మంచు లక్ష్మి అన్నారు. భువనగిరి పట్టణంలోని బాగాయత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌రూంను సోమవారం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటి వరకు తెలంగాణలో 264, ఆంధ్రప్రదేశ్‌లో 10, కర్ణాటకలో 10 పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో గత సంవత్సరం 56 పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేశామని, ఈ విద్యాసంవత్సరం క్లౌడ్ 4సీ సంస్థ సహకారంతో మరో 33 పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్మార్ట్ క్లాస్‌రూంలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ప్రతిభ కనబర్చిన 130 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశామన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. స్మార్ట్ క్లాస్‌రూంల ద్వారా ప్రభుత్వ పాఠశాల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విధంగా డిజిటల్ విద్య అందుతుందన్నారు. క్లౌడ్ 4సీ స్వచ్ఛంద సంస్థ సీఈఓ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ క్లాస్‌రూంలతో పాటు మరో 100 స్మార్ట్ క్లాస్‌రూంలను ఏర్పాటు చేసేందుకు నిధులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, డీఈఓ నారాయణరెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భారత్మ, టీచ్ ఫర్ చేంజ్ ఇన్‌చార్జ్ ఐశ్వర్య, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, ప్రమీళ, టీచర్లు పాల్గొన్నారు.

యాదాద్రీశుడి సన్నిధిలో మంచు లక్ష్మి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని సినీ నటి మంచు లక్ష్మి సోమవారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా.. ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం కొండ దిగువన ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న వేద పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల కోరిక మేరకు నూతన గురుకులాన్ని నిర్మాణం చేయించి ఇస్తానని మంచు లక్ష్మి హామీ ఇచ్చారని ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు.


యాదగిరిగుట్ట: మంచు లక్ష్మికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

చికిత్స పొందుతున్న యువకుడికి దాతల సాయం

సాక్షి ఎఫెక్ట్..

మునగాల(కోదాడ): 'పేద కుటుంబానికి పెద్ద కష్టం' అనే శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి పలువురు దాతలు స్పందించారు. మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మాదాసు నాగయ్య, భాగ్యమ్మ దంపతుల పెద్ద కుమారుడు దిలీప్‌కుమార్ రెండు కిడ్నీలు చెడిపోయి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి దీనస్థితి గురించి సాక్షి పత్రికలో చదివిన మునగాల మండల కేంద్రానికి చెందిన పెనుయేలు వర్షిప్ సెంటర్స్ ఆర్గనైజేషన్ సంస్థ అధినేత బిషప్ జె. సుదర్శనం సోమవారం రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన చల్లా గుర్వయ్య రూ.10వేలు, స్థానిక హరిజన కాలనీవాసులు రూ.10దివేలు, గ్రామానికి చెందిన పలువురు దాతలు కలిసి రూ.77వేలు ఆర్థికసాయం అందించారు. దీంతో సోమవారం ఒక్కరోజే రూ.1.25లక్షల ఆర్థికసాయం ఆ పేద కుటుంబానికి అందింది. పెనుయేలు సంస్థ తరఫున ఆర్థికసాయం అందించిన వారిలో సంస్థ ప్రతినిధులు జేజే సామ్యూల్‌సన్, ఎం. రాజేష్, జె. సామ్యూల్ ఉన్నారు. తమ కుటుంబం దీనగాథను వెలికితీసి తమకు అండగా నిలిచిన 'సాక్షి'కి దిలీప్‌కుమార్ సోదరుడు గౌతమ్ కృతజ్ఞతలు తెలిపారు.


దిలీప్‌కుమార్ తల్లికి రూ.25వేల ఆర్థికసాయం అందజేస్తున్న పెనుయేలు సంస్థ ప్రతినిధులు

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ధర్నా


ధర్నా చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు, యువకులు

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని పిలాయిపల్లి నుంచి పెద్దగూడెం, జూలూరు వరకు ఆగిపోయిన రోడ్డు మరమ్మతు పనులను వెంటనే తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెద్దగూడెం, అలీనగర్, జూలూరు గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, యువకులు జూలూరు చౌరస్తా వద్ద రోడ్డుపై ధర్నా నిర్వహించారు. రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేయడంతో రహదారిపై వాహనాలు ఎక్కడక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ధర్నా విరమించాలని వారికి నచ్చజెప్పారు. అధికారులు హామీ ఇచ్చేవరకు అక్కడ నుంచి వెళ్లమని చెప్పడంతో ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి ఫోన్‌లో ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరలో పనులు ప్రారంభించేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా పెద్దగూడెం మాజీ సర్పంచ్ మన్నె పద్మారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రెండేళ్లుగా మరమ్మతు పనులు చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసుల బాలరాజు, ఎండీ మక్బూల్, చంద్రశేఖర్‌రెడ్డి, మన్నె కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్, శ్రీకాంత్, దశరథరెడ్డి, యాదిరెడ్డి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

అతిసార వ్యాధితో వ్యక్తి మృతి

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెంలో అతిసార వ్యాధితో ఓ వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై సోమవారం సూర్యాపేట డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు కూడా చేశారు. రఘునాథపురం గ్రామంలో పలువురికి నీళ్ల విరేచనాలు కావడంతో స్థానికంగానే చికిత్స పొందారు. అయితే గ్రామంలోని రామాలయం వీధికి చెందిన పందిరి జానకిరాంరెడ్డి(63) మూడు రోజులుగా నీళ్ల విరేచనాలు కావడంతో మృతిచెందాడు. గ్రామస్తుల ఫిర్యాదుతో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు మఠంపల్లి పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ వర్కర్లు సోమవారం గ్రామానికి వెళ్లి తొమ్మిది బృందాలుగా ఏర్పడి ఇంటింటి సర్వే చేపట్టడంతో పాటు మురికి నీటి నిల్వలను తొలగించారు. వైద్య సిబ్బంది సమయానుకూలంగా స్పందించకపోవడం వల్లనే జానకిరాంరెడ్డి ప్రాణాలు కోల్పోయాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్‌నాయక్ స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో సర్వే నిర్వహించగా అతిసార వ్యాధిలేదని తేలిందని, కేవలం నీళ్ల విరేచనాలతో బాధపడుతున్న ఆరుగురిని గుర్తించామన్నారు. అతిసార వ్యాధిని గుర్తించేందుకు గ్రామంలో మెడికల్ క్యాంపు కొనసాగిస్తామన్నారు.


రఘునాథపాలెంలో నీటి నిల్వలను తొలగిస్తున్న వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

చందూరు: వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. చందూరు మండలం జోగిగూడేనికి చెందిన కొలుగూరి భిక్షమయ్య(65) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం తన వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించి సోమవారం సాయంత్రం తోటి రైతులతో కలిసి అమర్చారు. పక్కనే తన కుమార్తె జ్యోతికి చెందిన వ్యవసాయ బావి వద్ద మోటారు వైర్లు సరిచేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విద్యుత్ వైర్లు లాగుతుండగా..


నాగరాజు (ఫైల్)

గరిడేపల్లి: మండలంలోని కాచవారిగూడేనికి చెందిన కోడి నాగరాజు(45) వ్యవసాయంతో పాటు జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ సీజన్‌లో తనకున్న ఎకరంన్నర భూమిలో బోరు మోటారు బిగించి నారుమడికి నీళ్లు పెట్టాలని చూస్తే తన పొలంలో ఒక విద్యుత్ స్తంభం విరిగిపోయి ఉంది. దాని స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేసి సోమవారం తన అన్నలతో పాటు మరో ఇద్దరు రైతుల సహకారంతో వైర్లు లాగుతున్నారు. ఈ క్రమంలో రెండు స్తంభాల మధ్య ఎక్కువ దూరం ఉండడంతో ఒక వైరు జారి పైనున్న హైటెన్షన్ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లావణ్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

- పోలీసుల అదుపులో ఏడుగురు యువకులు

కోదాడరూరల్: కోదాడ పట్టణంలో గంజాయి విక్రయిస్తుండడంతో పాటు సేవిస్తున్న ఏడుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం కోదాడ పట్టణ సీఐ రాము స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన జుంజూరి సింహాద్రి, కోదాడ మండలం గుడిబండకు చెందిన ఓబులోజు అరవింద్, హైదరాబాద్‌కు చెందిన సింగజోజి అఖిల్, గంటా మోజేష్, సత్తుపల్లికి చెందిన జిల్లెల రాంబాబు, సింగపోగు శ్రీనాథ్, తెల్లూరి జంజయ్, సుజిత్, ఏసుబాబు స్నేహితులు. వీరందరికీ గంజాయి తాగే అలవాటు ఉంది. వీరిలో సింహాద్రి, అరవింద్, సుజిత్, ఏసుబాబు గంజాయి రవాణా కూడా చేస్తారు. రెండు రోజుల కిందట ఆ నలుగురు కలిసి ఒరిస్సాకు వెళ్లి అక్కడ ఐదు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. అందులో రెండున్న కిలోల గంజాయిని సుజిత్, ఏసుబాబు హైదరాబాద్‌కు తీసుకెళ్లగా మరో రెండున్నర కిలోల గంజాయిని సింహాద్రి, అరవింద్ కోదాడకు తీసుకొచ్చారు. వీరు కోదాడకు వచ్చిన తర్వాత అందరూ కలిసి పట్టణ పరిధిలోని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట గల గోల్డెన్ సిటీ వెంచర్‌లో మరొకరికి అమ్మేందుకు సిద్ధమవుతుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10వేలు విలువ చేసే రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సుజిత్, ఏసుబాబులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రంజిత్‌రెడ్డి, సిబ్బంది బాల్తు శ్రీను, యల్లారెడ్డి, సతీష్, యాకుబ్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాము

మూడేళ్ల తర్వాత తెరుచుకున్న బడి

- విద్యార్థుల్లేక మూతపడిన ప్రాథమికోన్నత పాఠశాల
- బడిబాటలో అవగాహన కల్పించిన ఉపాధ్యాయుడు
- ఈ విద్యా సంవత్సరం 10మంది చేరిక


విద్యార్థులకు చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు రామకృష్ణ

ఆత్మకూరు(ఎం): విద్యార్థులు లేక మూడేళ్ల క్రితం మూతపడిన ఆత్మకూరు(ఎం) మండలంలోని పోతిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఎట్టకేలకు తెరుచుకుంది. గ్రామానికి చెందిన 30 మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తుంటారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల మూతపడేసరికి ప్రైవేట్ స్కూళ్లలో చదివించే స్థోమత లేని వారు తమ పిల్లలను గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొరటికల్ ప్రాథమిక పాఠశాలకు పంపేవారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం గ్రామంలో బడిని తెరిపించడానికి దోహదపడింది. పాఠశాల ఉపాధ్యాయుడు రామకృష్ణతో పాటు పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్ యశోద పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ కల్పిస్తున్న ఉచిత వసతుల గురించి వివరించారు. తమ పిల్లల్ని ప్రభుత్వ బడికి పంపితే గ్రామంలోని పాఠశాలను తిరిగి తెరుస్తారని, వారికి చదువు రానట్లయితే మమ్మల్ని ప్రశ్నించండని చెప్పడంతో తల్లిదండ్రులు ఆలోచనలో పడి ఉపాధ్యాయుడు చేసిన విజ్ఞప్తికి ఒప్పుకున్నారు. దీంతో పాఠశాలకు తమ పిల్లలను 10మంది వరకు పంపడంతో మూడేళ్లుగా మూతపడ్డ పాఠశాలను తెరిపించారు. ఇప్పుడు ఆ పది మంది విద్యార్థులకు రామకృష్ణ ఒక్కడే ఉపాధ్యాయుడు కాగా.. పది మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్నట్లయితే మరో ఉపాధ్యాయుడు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషిచేస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషిచేస్తా



గ్రామం నుంచి సుమారు 30మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందజేస్తాం. పిల్లలు పాఠశాల వైపు ఆకర్షించడానికి ప్రత్యేకంగా బోధన చేస్తున్నాం. వారితో కలిసి ఉంటున్నాం. ఇంకా పిల్లల సంఖ్య పెరగాడానికి కృషిచేస్తా.

– పి. రామకృష్ణ, ఉపాధ్యాయుడు

కార్పొరేషన్ చైర్మన్ల రాజకీయ నేపథ్యం ఇదీ..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ సోమవారం నామినేటెడ్ పదవుల జాబితా విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్ పదవులు దక్కాయి. వారి రాజకీయ నేపథ్యం ఇలా కొనసాగింది.

విద్యార్థి నేత నుంచి కార్పొరేషన్ చైర్మన్‌గా..

మోత్కూరుకు చెందిన నాగరిగారి ప్రీతమ్ ప్రస్తుతం టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా ఉన్నారు. 2002లో కళాశాల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షునిగా, 2005లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కన్వీనర్‌గా, 2007లో ఎన్ఎస్‌యూఐ జాతీయ సాంస్కృతిక వ్యవహారాల కన్వీనర్‌గా పనిచేశారు. ఆ తరువాత యూత్ కాంగ్రెస్ జాతీయ స్థాయి పదవుల్లో పనిచేశారు. రాహుల్‌గాంధీ డిస్కవరీ ఆఫ్ ఇండియా టూర్ కోసం అనేక రాష్ట్రాల్లో పనిచేశారు. 2015–17 వరకు టీపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా, 2014 – 2015లో జాతీయ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. 2005 నుంచి 2007 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2017 నుంచి 2020 వరకు ఏఐసీసీలో ఎస్సీ సెల్ కన్వీనర్‌గా, ఏఐసీసీ సభ్యునిగా ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

సర్పంచ్ నుంచి అంచెలంచెలుగా..

సూర్యాపేట మండలంలోని బాలెంల సర్పంచిగా 1995లో ఎన్నికైన పటేల్ రమేష్‌రెడ్డి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయనకు ప్రస్తుతం టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ప్రభుత్వం కట్టబెట్టింది. మొదట సర్పంచ్ అయిన ఆయన 2001లో బాలెంల ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. 2000 సంవత్సరం నుంచి 2012 వరకు తెలుగుదేశం పార్టీసూర్యాపేట మండల అధ్యక్షులుగా, 2012లో సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేశారు. 2016 నుంచి 2017 వరకు సూర్యాపేట జిల్లా టీడీపీ అధ్యక్షునిగా పనిచేశారు. 2018లో కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ సమక్షంలో చేరారు. అనంతరం రమేష్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పగ్గాలు కట్టబెట్టింది.

వికలాంగుల హక్కులపై పోరాటం చేస్తూ..

కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం చైర్మన్‌గా వికలాంగుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న ముత్తినేని వీరయ్య వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కట్టవారిగూడెం గ్రామానికి చెందిన వీరయ్య 2011లో వికలాంగులు, వృద్ధులు, వితంతువుల హక్కుల పోరాట సమితిని స్థాపించి వారి హక్కుల కోసం పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, పార్లమెంట్ ఎన్నికల్లో విజయ సంకల్ప యాత్ర చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేశారు. ఐఏఎస్ కావాలని కలలుగన్న వీరయ్య.. శ్రీరామానుజన్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ స్థాపించి శిక్షణ పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నారు. వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమశాఖ విలీనం రద్దు కోసం పోరాటం చేశారు. గత ప్రభుత్వం హయాంలో పెరిక కుల కార్పొరేషన్ సాధన కోసం పోరాటం చేశారు.

నక్సలిజం నుంచి రాజకీయాల్లోకి..

ఆలేరుకు చెందిన బండ్రు శోభారాణి ఏడేళ్లపాటు పీపుల్స్‌వార్‌లో పనిచేసి తరువాత కాలంలో రాజకీయాల్లోకి వచ్చారు. 1988 నుంచి 1995 వరకు నక్సలైట్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆమె తరువాత తన పుట్టిన ప్రాంతమైన మెదక్ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించారు. 1999 నుంచి 2001 వరకు ప్రొఫెసర్ జయశంకర్ సారథ్యంలోని తెలంగాణ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. అంటరానితనానికి వ్యతిరేకంగా, రైతుల హక్కుల కోసం పోరాటాలు చేశారు. 2001లో రాజకీయ జీవితం ప్రారంభించారు. టీఆర్ఎస్ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. 2001లోనే టీఆర్ఎస్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. 2005లో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, మహిళ అధ్యక్షురాలిగా పనిచేశారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఆలేరులో పోటీచేశారు. 2021లో కాంగ్రెస్ పార్టీలో చేరి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర మహిళ సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.

ఒకరి ఇల్లు మరొకరి పేరిట రిజిస్ట్రేషన్

- రికార్డుల్లో నాగారం బదులు నాగారంబంగ్లా అని తప్పుగా నమోదు చేసిన అధికారులు

నాగారం: అధికారుల నిర్లక్ష్యంతో ఒకరి ఇల్లు మరొకరికి రిజిస్ట్రేషన్ అయిన ఘటన నాగారం బంగ్లాలో జరిగింది. బాధితుడు గుంటకండ్ల ముకుందారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల కేంద్రానికి చెందిన జాజుల మంగయ్య ఇంటిపై రుణం తీసుకోవడానికి తన పేరిట 5–7 నంబర్‌తో ఉన్న ఇల్లును తన భార్య జాజుల మరియమ్మ పేరుపై మార్పించడానికి సూర్యాపేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ఇంటిని రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో అధికారులు నాగారం గ్రామానికి బదులుగా నాగారంబంగ్లా అని తప్పుగా నమోదు చేశారు. దీంతో నాగారంబంగ్లా గ్రామంలో 5–7 నంబర్‌తో గుంటకండ్ల ముకుందారెడ్డి పేరుపై ఉన్న ఇల్లు జాజుల మరియమ్మ పేరుమీదకు మారింది. బాధితుడు ముకుందారెడ్డి ఇటీవల ఇంటికి పన్ను చెల్లించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా రికార్డులో తన పేరుపై ఇల్లు లేదని తెలియడంతో ఖంగుతిన్నాడు. దీంతో ఆయన వెంటనే జాజుల మరియమ్మ దంపతులను తీసుకొని సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా.. అక్కడ అధికారులు నాగారం గ్రామం బదులుగా నాగారంబంగ్లా అని నమోదు చేయడంతో పేరు మారిందని, దీనిని సవరిస్తామని చెప్పారు. ఇప్పటికే ఐదు రోజులు గడుస్తున్నా తప్పును సవరించడం లేదని బాధితుడు వాపోయాడు. కాగా మరియమ్మ ఓ ప్రైవేట్ సంస్థ ద్వారా ఇంటిపై రూ.7.50లక్షల రుణం తీసుకుంది. దీంతో బాధితుడు తన ఇంటిపై రుణం తీసుకున్నారని, అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించి తన పేరుపై ఉన్న ఇల్లు మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని వాపోయాడు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మఠంపల్లి: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం స్థానిక పోలీసులు పట్టుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. మఠంపల్లి ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లికి చెందిన వంగవేటి చినరామయ్య 15 క్వింటాళ్లు, తవనం శ్రీనివాసరెడ్డి 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తమ ఇళ్లలో నిల్వ చేయగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి బియ్యాన్ని పట్టుకున్నారు. ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


మఠంపల్లి: పట్టుబడిన పీడీఎస్ బియ్యం సీజ్ చేస్తున్న ఎస్ఐ రామాంజనేయులు

చిలుకూరు మండలంలో 16 క్వింటాళ్లు..

చిలుకూరు: మండలంలోని దూదియాతండా గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఎస్ఐ సురభి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. దూదియాతండా గ్రామానికి స్వామి ఇంట్లో నారాయణపురం గ్రామానికి చెందిన చర్ల సహదేవ్ రేషన్ బియ్యం నిల్వ ఉంచాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సోమవారం అక్కడికి వెళ్లి 16 క్వింటాళ్ల(33 బస్తాలు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సహదేవ్‌పై కేసు నమోదు చేసి పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

కొండమల్లేపల్లిలో 9 క్వింటాళ్లు..

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద సోమవారం తెల్లవారుజామున పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా పలుగుతండా నుంచి అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

తిప్పర్తి మండలంలో మూడున్నర క్వింటాళ్లు..

రామగిరి(నల్లగొండ): పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై సోమవారం తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. తిప్పర్తి మండలంలోని గోదారిగూడేనికి చెందిన మర్రిపెద్ది శివకృష్ణ తన ఆటోలో తిప్పర్తి పరిసర ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని సేకరించి తీసుకెళ్తుండగా పోలీసులు మర్రిగూడెం గ్రామ స్టేజీ వద్ద పట్టుకున్నారు. ఆటోలో తరలిస్తున్న మూడున్నర క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.